## సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఉప ఎంపీడీఓ.




**నాతవరం పెన్ సత్తా, జూన్ 30**చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డిప్యూటీ ఎంపీడీవో కే.మూర్తిబాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో చెత్త సేకరణ తడి-పొడి వ్యర్థాల వేరు చేయడం, సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్తను సేకరించే సిబ్బంది తడి, పొడి చెత్తగా వేరు చేసి ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కేంద్రం తొట్టెల్లో తడి చెత్త కుళ్లబెట్టి వానపాములు వదిలి వర్మీ కంపోస్టు తయారు చేసుకోవడం ద్వారా పంచాయతీకి ఆదాయం సృష్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కొండాజీ, పంచాయతీ కార్యదర్శి బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఐ

## రాజ్య సభకు ఎన్నికైన విజయ్ ని ఘనంగా సన్మానించాలి.

● టీడిపి అధ్యక్షుడు వెంకటరమణ.



**నాతవరం పెన్ సత్తా, జూన్ 30** నాతవరం టీడీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ విస్తృత స్థాయి
సమావేశం జరిగింది.టీడిపి మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో
తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ చిన్న వయసులో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై యువతకు ఆదర్శంగా నిలిచిన చింతకాయల విజయ్ కు ఘన స్వాగతం పలికి సన్మానించడం ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాధ్యత అని అన్నారు.యువత రాజకీయాల్లో మరింత ముందుకు రావడానికి ప్రేరణంగా నడుస్తుందని అన్నారు .అలాగే బుధవారం జరగనున్న విజయబాబు పౌర సన్మాన కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు యువత అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు సాయంత్రం మూడు గంటలకు తాండవ జంక్షన్ నుంచి బయలుదేరాలని కోరారు. ఈ సమావేశాలలో మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు .నాచవరం పిఎస్సిఎస్ అధ్యక్షుడు ఆపి రెడ్డి మాణిక్యం .పీకే గూడెం పి పీకే గూడెం పి ఎస్ సి ఎస్ అధ్యక్షులు అంకోరెడ్డి నాని బాబు .మండల తెలుగు యువత అధ్యక్షుడు పోలుపర్తి సాయి .నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా వెంకట కృష్ణారావు నాతవరం గ్రామ కమిటీ అధ్యక్షులు పైల సూరిబాబు యటంట్టి సీతారాం మాజీ తెలుగు యువత అధ్యక్షులు శెట్టి లోవ .మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు సత్యవతి .పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి.

కాశీపురం పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ..



**వి.మాడుగుల పెన్ సత్తా, జూన్ 30**విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలంటే ఉపాధ్యాయులు అంకితభావంతో పరిచేయాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని కాశీపురం ఎంపీపీ ఎస్ పాఠశాలలు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయుల హాజరు పట్టిక యం డి యం రికార్డులు జి ఎఫ్ ఎల్ గణంకాలు పరిశీలించారు.విద్యార్థులతో క్షుణ్ణంగా చర్చించారు.మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు జరుగుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.పాఠశా ల భవనాలు మరుగుదొడ్లు వంటగది పరిస రాలు పరిస్థితులను సమీక్షించారు.ప్రధానోపా ధ్యాయుడు పెదపూడి దయాసాగర్ సమక్షంలో కళ్యాణ్ రిషి వసంత అనే విద్యార్థులను తూచా తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం పక్కనే ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఈఓతో ఎంఈఓ(1) జి ఈశ్వరరావు ఎంఈఓ(2) బి. దేవుడమ్మలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయితీ కార్యదర్శి.




**నక్కపల్లి/అనకాపల్లి జిల్లా పెన్ సత్తా, జూన్ 30**మర్రిబంద జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి చెందాడు. నక్కపల్లి ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాలు మేరకు ఎన్ నరసాపురం పంచాయతీ కార్యదర్శి కిల్లాడ బాబురావు(52) మంగళ వారం ఉదయం తాను నివాసం ఉంటున్న పాయకరావుపేట నుండి స్కూటీ పై బయలుదేరి అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి కార్యా లయానికి వెళ్తుండగా మర్రిబంద జంక్షన్ వద్ద వెనక నుండి లారీ ఢీకొట్టడంతో బాబురావు స్కూటీ పైనుంచి తుళ్ళి రోడ్డుపై పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో బాబురావు సంఘటనా స్థలంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేంద్ర తెలిపారు.

# గుడివాడ అమర్నాథ్ కు సంఘీభావంగా చలో విజయవాడ




నక్కపల్లి నుండి తరలి వెళ్లిన వైసీపీ క్యాడర్



**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 30:** మాజీ మంత్రి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ కు ఏపీ మహిళా కమిషన్ నందు హాజరైనా సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా నుండి వైయస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సంఘీ భావం తెలిపారు. మంగళవారం గుడివాడ అమర్నాథ్ తో చలో విజయవాడ కార్యక్రమం లో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజు, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, జనరల్ సెక్రటరీ శీరం నరసింహామూర్తి, మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు,రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి చంద్రరావు , సురకాసుల గోవిందు, పొడకట్ల పాపారావు, కొప్పిశెట్టి హరిబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గొర్ల నరసింహామూర్తి ,నక్కపల్లి మండల యూత్ వింగ్ ప్రెసిడెంట్ బచ్చల రాజు , యువ నాయకులు యలమంచిలి ప్రకాష్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# హాస్టల్స్ లో అంటువ్యాధుల నివారణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీలు.



**అనకాపల్లి పెన్ సత్తా, జూన్ 30**జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు ఇతర నివాస సంస్థ ల్లో అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లా పరిపాలన జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు.ఈ కమిటీల్లో పంచాయతీరాజ్ ఒ గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ పరిపాలన వైద్య ఆరోగ్య శాఖ ఆహార భద్రత పశు సంవర్ధక బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.కమిటీలు సంక్షేమ వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి పారిశుద్ధ్యం తాగునీటి నాణ్యత, ఆహార భద్రత, పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులు, నివాసితుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే లోపాలను వెంటనే గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే ఇంటర్-రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ను రంగంలోకి దించి తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు.

# బిఎల్వోలు తప్పని సరిగా ప్రతీ ఇంటికి వెళ్లాల్సిందే.




జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి పెన్ సత్తా, జూన్ 30**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే పురోగతిపై మంగళవారం ఉదయం ఇన్చార్జి డి.ఆర్.వో వై.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి లతో కలసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మండల స్థాయి బూత్ లెవల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతి మండలంలో ఇప్పటివరకు ఎన్ని ఫారాలు సేకరించారు, ఇంకా ఎన్ని ఫారాలు మిగిలి ఉన్నాయో, ఇంటింటి సర్వే పురోగతి ఎలా ఉందో మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా సర్వేను పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఓటరికి సంబంధించిన వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించాలని, ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత ఫారాలను 15 రోజులలోగా పూర్తి చేయాలని బి ఎల్ల ఓలకు కలెక్టర్ ఆదేశించారు. సందేహాలు తలెత్తిన సందర్భాల్లో వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.గుర్తింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో ఇన్చార్జ్ డి.ఆర్.వో వై శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి మరియు ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లు, మండల స్థాయి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం.

నిర్దేశించిన గడువు లోపల పనులు పూర్తి చేయాలి.

జిల్లా కలెక్టర్ నిషాంతి.



**పాడేరు పెన్ సత్తా, జూన్ 30** జిల్లాలో అమలు జరుగుతున్న పలు ప్రభుత్వ అభివృద్ధి పనుల ప్రగతిపై సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమక్షంలో కలెక్టర్ నిషాంతి సమీక్షా సమావేశం నిర్వహించారు.మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, రూరల్ వాటర్ సప్లై, ట్రైబల్ వెల్ఫేర్, పి ఐ యు, హౌసింగ్ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో ఆయా శాఖల పరిధిలోగల పనుల ప్రగతి, పురోగతిపై క్షుణ్ణంగా శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సంయుక్తంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

జిల్లాలో పీఎం జన్ దన్, డి ఏ జూగా, ఎన్ హెచ్ ఏం, సిసిడి పి నిధుల క్రింద మంజూరై, నిర్మితమవుతున్న పనులు ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని, నిర్దేశించిన పనులలో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలతో పాటు సీసీఎ రూల్స్ కు విరుద్ధంగా ప్రవర్తించిన వారికి చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. ఇందులో భాగంగా, అంగన్వాడి భవనాలు, అలాగే ఆయా భవనాలకు కావలసిన మౌలిక వసతులు, స్కూల్ భవనాల అదనపు గదుల నిర్మాణము, పీహెచ్సీ భవనాల నిర్మాణము,బర్త్ వెయిటింగ్ హోమ్' నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సాధించి పనులు పూర్తి చేయాలన్నారు.ఈ సమీక్షలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, అంగన్వాడి భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు, గర్భిణీ స్త్రీల రక్షణ, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల ("బర్త్ వెయిటింగ్ హోమ్") నిర్మాణ పనుల నివేదికను అధికారులు డిజిటల్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ వారికి సమర్పించారు.ప్రాజెక్ట్ వివరాలు, కొండకింద గ్రామంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, అంచనా వ్యయం, ఏప్రిల్ 2026 నాటికి జరిగిన కాలపరిమితి పురోగతిపై అధికారులు సమగ్రమైన నివేదికను డిజిటల్ స్లైడ్ల రూపంలో వివరించారు.ఈ సమావేశంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, ఆర్డబ్ల్యూ ఎస్ అధికారి నాగేశ్వరరావు, ఈఈ పంచాయతీ రాజ్ అధికారి కొండయ్య పడాలల్ , ఆర్ అండ్ బి అధికారి ఏం ఎల్ వి సాగర్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ డేవిడ్ రాజ్, ఈఈ ఇరిగేషన్ రాజేశ్వరరావు, పిడి హౌసింగ్ బాబు, వివిధ శాఖల ఇంజనీరింగ్ ఏఈలు డి ఇ లు ఇతర సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily
బుధవారం 1 జూలై 2026


## సంపాదకీయం

# మిత్రుల నిష్క్రమణ!

తమిళనాడు రాజకీయాల్లో మరో పెద్ద కుదుపు. వయోవృద్ధ పార్లమెంటేరియన్, ఎండీఎంకే వ్యవస్థాపకుడు వైకో ఆదివారం తన పార్టీని.. తొమ్మిదేళ్ల భాగస్వామ్యానికి ముగింపు పలుకుతూ డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ నుంచి బయటకు లాగారు. పార్టీ 32వ సాధారణ మండలి సమావేశంలో అలయన్స్ నుంచి వైదొలగాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. నటుడు సి.జోసెఫ్ విజయ్ స్థాపించిన కొత్త పార్టీ తమిళగ వెట్రి కజగం (టీవీకే) మొన్నటి ఎన్నికల్లోనే అసాధారణ విజయం సాధించి, రాష్ట్రంలో 59 ఏళ్ళుగా కొనసాగుతున్న ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి తెరదించడం చూసిందే. వరుసగా మూడుసార్లు కోలాత్తూరు స్థానం నుంచి విజయం సాధించిన స్టాలిన్.. ఈసారి ఓటమితో మే 5న సీఎం పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామాల తర్వాత డీఎంకే మిత్రపక్షాలు ఒక్కొక్కటిగా దూరం జరగడం ప్రారంభమైంది. డీఎంకే నేతృత్వంలోని ఎస్‌పీఏ విచ్ఛిన్నం –క్రమంగా జరిగిన రాజకీయ పునర్వ్యవస్థీకరణ. మే నెలలో హంగ్ అసెంబ్లీ ఏర్పడిన తర్వాత, విజయ్ నేతృత్వంలోని టీవీకే కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్, సీపీఎం, సీపీఐలను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించింది. మే 6న కాంగ్రెస్ టీవీకేతో పొత్తుకు అంగీకరించి, కామరాజ్ వారసత్వాన్ని, పెరియార్ సామాజిక న్యాయ ఆదర్శాలను, అంబేడ్కర్ రాజ్యాంగ సూత్రాలను తమిళనాడులో పునరుద్ధరిస్తామని ప్రకటించింది. మే 21న ఐయూఎంఎల్ తన ఎమ్మెల్యే ఏఎం షాజహాన్‌ను టీవీకే ప్రభుత్వంలో మంత్రి పదవికి అధికారికంగా నామినేట్ చేసింది; అదే రోజు వీసీకే కూడా తన ఎమ్మెల్యే వన్ని అరసును మంత్రి పదవికి నామినేట్ చేసింది. సీపీఐ, సీపీఎం పార్టీలు సైతం టీవీకే ప్రభుత్వానికి షరతులు లేని మద్దతు ప్రకటించాయి. ఇలా ఎండీఎంకే.. డీఎంకే నేతృత్వంలోని ఎస్‌పీఏ నుంచి వైదొలగిన ఆరో పార్టీగా నిలిచింది. ఈ పరిణామాల నేపథ్యంలో డీఎంకేకు మిగిలింది ఒక్క డీఎండీకే మాత్రమే. డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ ఇటీవల డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌ను కలిసి తమ పార్టీ మద్దతును పునరుద్ఘాటించారు.

ఎండీఎంకే వైదొలగడానికి కారణాలు –పార్టీ అస్తిత్వ సంక్షోభానికి సంబంధించినవి. ఎండీఎంకే అభ్యర్థులు డీఎంకే గుర్తుపై పోటీ చేయాలన్న పట్టుదలను ఎండీఎంకే తన స్వతంత్ర అస్తిత్వానికి ముప్పుగా భావించింది. 1990లలో డీఎంకే నుంచి తీవ్రమైన చీలిక ద్వారా పుట్టిన ఎండీఎంకేకు, తన సొంత గుర్తు లేకుండా ఎన్నికల్లో పోటీ చేయడం 2026 ఎన్నికల్లో అస్తిత్వ అవమానంగా మారింది. దక్షిణాది రాజకీయాల్లో సొంత గుర్తులేని పార్టీని ఆత్మలేని పార్టీగా చూస్తారని, అందుకే స్వతంత్ర అస్తిత్వాన్ని తిరిగి పొందడం మనుగడ ప్రశ్నగా మారిందని ఎండీఎంకే నేత దురై వైకో పేర్కొన్నారు. అంతేకాకుండా, తమ ఇద్దరు ఎమ్మెల్యేలను రాజీనామా చేయించాలని విజయ్ కోరారన్న వైకో వెల్లడింపు హార్స్ ట్రేడింగ్ ఆరోపణలకు తెర తీసింది. అయితే, డీఎంకే రైజింగ్ సన్ గుర్తుపై గెలిచిన రాజేంద్రన్, సెంథిల్ సెల్వన్ అనే ఇద్దరు ఎమ్మెల్యేలు తమిళనాడు అసెంబ్లీలో డీఎంకే సభ్యులుగానే కొనసాగుతారు. ఈ పరిణామం డీఎంకే అంతర్గత నిర్వహణలో, మిత్రపక్షాలపట్ల వ్యవహరించిన తీరులో లోపాలున్నాయని స్పష్టం చేస్తోంది. డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ కుటుంబ సభ్యులకు పార్టీ వ్యవహారాల్లో, పరిపాలనలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు సుదీర్ఘకాలంగా వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష నేత ఎడప్పాడి కె.పళనిస్వామి నుంచి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ వరకు అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు చేయడం ఈ అపోహలకు మరింత బలాన్నిచ్చింది. కానీ వీటన్నింటికీ మించి, సినీ నటుడు విజయ్ క్రేజ్, యువతలో అతనిపై ఉన్న ఆకర్షణ ఎన్నికల ఫలితాలను తారుమారు చేసింది. 18నుంచి 39 ఏళ్ళ వయసు గల ఓటర్లు, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత గణనీయంగా టీవీకేకు మద్దతుగా నిలిచారు; ఇది పార్టీ 108 సీట్లు సాధించడంలో కీలక పాత్ర పోషించింది. యువత, చిన్నారులు సైతం పెద్దలను ఒప్పించి టీవీకేకు ఓటు వేయించడం డీఎంకే ఊహించని పరిణామం. డీఎంకే తన అంతర్గత అంచనాల ఆధారంగా అతి విశ్వాసంతో వ్యవహరించి, సకాలంలో దిద్దుబాటు చర్యలు తీసుకోలేకపోయింది. కాగితంపై అంకగణితపరంగా బలంగా కనిపించినప్పటికీ, మిత్రపక్షాల మధ్య సమన్వయ లోపం, అస్థిరమైన ప్రచార సందేశాలు, పలు నియోజకవర్గాలలో ఓట్ల బదిలీ సరిగా జరగకపోవడం అలయన్స్ ఎన్నికల పనితీరును దెబ్బతీశాయి.

చరిత్ర చెప్పే పాఠం ఏమిటంటే, తమిళనాడు రాజకీయాల్లో శాశ్వతమైనది ఏదీ లేదు. గతంలో అనేకసార్లు ఓటమి చవిచూసిన డీఎంకే, ఫీనిక్స్ పక్షిలా పైకి లేచిన చరిత్ర ఉంది. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. కేవలం 47 సీట్లతో హిందుత్వ శక్తులతో జతకట్టిన అన్నాడీఎంకేను అధికారంలోకి తీసుకురావాలని ప్రయత్నించిందన్న ఆరోపణ డీఎంకే ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రజలు మొదటి ప్రాధాన్యంగా ఎన్నుకున్న టీవీకేను కాదని, అధికారాన్ని చేజిక్కించుకునే ప్రయత్నం చేసిందన్న ముద్రపడటం డీఎంకే భవిష్యత్ రాజకీయ నిర్ణయాలపై నీలి నీడలు వేస్తోంది. ఇక ఎండీఎంకే తాజాగా టీవీకే వైపు మొగ్గు చూపడం పరిస్థితిని మరింత స్పష్టం చేస్తోంది. ఎస్‌పీఏ నుంచి వైదొలిగిన తర్వాత ఎండీఎంకే విజయ్ నేతృత్వంలోని టీవీకే వైపు మొగ్గు చూపింది; టీవీకే ప్రభుత్వం అవినీతి వ్యతిరేక వైఖరిని, ద్విభాషా విధానాన్ని అనుసరిస్తున్నందుకు వైకో మద్దతు ప్రకటించారు. ఈ ప్రభుత్వంలో కమిషన్లు లేవని, అవినీతి లేదని తాను నమ్ముతున్నానని వైకో పేర్కొన్నారు. ద్రవిడ రాజకీయాల వారసత్వ సంరక్షకుడిగా, తమిళ అస్తిత్వ కాపలాదారుగా తనను తాను చిత్రీకరించుకున్న డీఎంకే ఇప్పుడు అదే పాత్రను తిరిగి పొందగలదా? అన్నది సందేహాస్పదమే. ఎందుకంటే టీవీకే కూడా ద్రవిడ రాజకీయాల నినాదాలనే పునరావృతం చేస్తూ, ద్రవిడ పెద్దన్నల చర్యలనే అనుకరిస్తోంది. ఈ నేపథ్యంలో డీఎంకే ముందున్న సవాలు స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం పాత మిత్రులను బుజ్జగించడం సరిపోదు; పార్టీ అంతర్గత పారదర్శకత, నాయకత్వ జవాబుదారీతనం పెంచుకోవడం ద్వారానే తిరిగి విశ్వసనీయతను చూరగొనగలదు. రాబోయే ఉప ఎన్నికల్లో డీఎంకే ఒంటరిగా ఎలా నిలబడుతుందో, టీవీకే ప్రభంజనాన్ని ఎలా ఎదుర్కొంటుందో చూడాల్సి ఉంది. లేకుంటే, ఒకప్పుడు తమిళనాడు రాజకీయాలను శాసించిన పార్టీ క్రమంగా చారిత్రక అట్టడుగుకు చేరే ప్రమాదం ఉంది!



# జీవితానికీ.. ఓ టైమ్‌లైన్ ఉంది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యధిక పారితోషికం తీసుకునే అగ్ర కథానాయికల్లో కత్రినా కైఫ్ ఒకరు. కేవలం నటనలోనే కాకుండా అద్భుతమైన ఫిట్‌నెస్, డ్యాన్స్, జీవనశైలి, తన సొంత బ్రాండ్ 'కే బ్యూటీ' ద్వారా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారు. నిరంతరం కష్టపడే తత్వం, ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని నిలబడే మనస్తత్వం ఉన్న కత్రినా.. గతంలో తన సినిమా 'ఫోన్ భూత్' ప్రమోషన్ల సమయంలో ప్రసిద్ధ జర్నలిస్ట్ అనుపమ చోప్రాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన జీవితంలో నేర్చుకున్న ఒక అమూల్యమైన పాఠాన్ని షేర్ చేసుకుంది. "నేను నా జీవితంలో నిరంతరం నేర్చుకుంటున్న అతిపెద్ద పాఠం ఏంటంటే.. ఏవి ఎప్పుడు జరగాలో ఆ సమయంలోనే జరుగుతాయి. వాటిని మనకు నచ్చిన టైమ్‌లైన్‌లో బలవంతంగా జరిపించాలని చూడకూడదు" అన్నారు. ఈ ఒక్క మాట ప్రస్తుతమున్న ఉరుకుల పరుగుల సమాజానికి ఎంతో అవసరమైన సందేశం.

కత్రినా మాటల అంతరార్థం ఏంటి?

ప్రతిదానికీ ఒక డెడ్‌లైన్ పెట్టుకుని, నిరంతరం ఒత్తిడితో బతికే నేటి ప్రపంచంలో కత్రినా మాటలు ఒక మేల్కొలుపు. మనం ఎంతగా ప్లాన్ చేసినా, ఏం చేసినా జీవితమనేది దాని సొంత టైమ్‌లైన్ ప్రకారమే నడుస్తుంది! ఇది అంగీకరించాల్సిన వాస్తవం. ఏదైనా ఒక విషయం జరగాల్సిన సమయం వచ్చినప్పుడే జరుగుతుంది. కాబట్టి మనకు నచ్చినట్టుగా అది ఇప్పుడే జరిగిపోవాలని తొందరపడకూడదు, బలవంత పెట్టకూడదు. తన సుదీర్ఘ సినీ కెరీర్ ప్రయాణమే తనకు ఓపికగా ఉండటాన్ని నేర్పిందని ఆమె స్పష్టం చేశారు. మనం ఒక నిర్దిష్ట వయసు వచ్చేసరికి ఈ ఉద్యోగం రావాలి, ఈ పొజిషన్‌కు వెళ్లాలి లేదా పెళ్లి చేసుకోవాలని మనకు మనమే కండిషన్లు పెట్టుకుంటాం. కానీ, వాటన్నింటినీ వదిలేసి జీవిత గమనాన్ని స్వేచ్ఛగా సాగనివ్వాలని కత్రినా మాటలు సూచిస్తున్నాయి.

నేటి తరానికి ఈ సూత్రం..?

డిజిటల్ యుగంలో విజయాన్ని సాధించిన సమయాన్ని బట్టి కొలుస్తున్నారు తప్ప, అసలైన ప్రతిభను బట్టి కాదు. 25 ఏళ్లకే అది సాధించాలి, 30 ఏళ్లకే ఇది అవ్వాలి అనే ఒత్తిడి యువతలో ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి తరుణంలో కత్రినా చెప్పిన ఓపిక, లొంగిపోవడం, మన ప్రయత్నంపై నమ్మకముంచడం అనే సూత్రాలు ప్రశంసనీయం.

కత్రినా కైఫ్ తన జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ.. తన కెరీర్‌లో, వ్యక్తిగత జీవితంలో సాధించిన ఎన్నో మైలురాళ్లు ఆమె అనుకున్న సమయం కంటే భిన్నంగా జరిగాయని, అయితే ఆమె ఊహించిన దానికంటే చాలా మెరుగ్గా జరిగాయని గుర్తుచేసుకున్నారు.

"ప్రతి ఫలితాన్ని మనమే నియంత్రించాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. జీవిత కాలంపై నమ్మకం ఉంచాలి. కొన్నిసార్లు అనుకోకుండా జరిగే ఆలస్యం.. మనం మొదట ఊహించిన దానికంటే మెరుగైన అవకాశాలకు దారితీస్తుందని" ఆమె యువతకు విలువైన సలహా ఇచ్చారు.

కత్రినా ప్రస్థానం..

బ్రిటిష్ మూలాలున్న కత్రినా కైఫ్ జులై 16, 1983న జన్మించారు. హిందీ చిత్రసీమలో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె.. నాలుగు స్క్రీన్ అవార్డులు, నాలుగు జీ సినీ అవార్డులతో పాటు మూడు ఫిల్మ్‌ఫేర్ నామినేషన్లను దక్కించుకున్నారు.


# తూర్పు దిశగా భారత్..!!




భారత విదేశాంగ విధానంలో ఇండో–పసిఫిక్ ప్రాంతం పట్ల ప్రస్తుతం గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కో పర్యటనను విడిగా చూస్తే, దేశం అనుసరిస్తున్న వ్యూహాత్మక దృక్పథం పూర్తిగా అర్థం కాదు. జపాన్ ప్రధాని సనాయ్ తకాయిచితో ప్రధాని నరేంద్ర మోదీ జరుపనున్న వార్షిక శిఖరాగ్ర సమావేశం నేటినుంచి న్యూఢిల్లీలో జరగనుంది. జపాన్ ప్రధాని సనాయ్ తకాయిచి జూలై 1 నుంచి 3 వరకు భారత్‌లో పర్యటించి, న్యూఢిల్లీలో 16వ భారత్–జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఇది భారత్‌కు ఆమె తొలి అధికారిక పర్యటన. మొదట ఈ సమావేశం అస్సాంలోని గువాహటిలో జరగాల్సి ఉండగా, లాజిస్టిక్స్ సమస్యల కారణంగా ఆ ప్రణాళికను రద్దు చేసి, న్యూఢిల్లీలో నిర్వహించాలని నిర్ణయించారు. తకాయిచి వెంట సుజుకి మోటార్ అధ్యక్షుడు తోషిహిరో సుజుకితో సహా 50కి పైగా జపాన్ కంపెనీల ప్రతినిధులు రానున్నారు. ఈ సమావేశం ఒక్కటే కాదు –ఇండోనేషియా, ఆస్ట్రేలియాలకు మోదీ తిరిగి పర్యటించడం, నలభై ఏళ్ళ తర్వాత న్యూజిలాండ్‌కు భారత ప్రధాని తొలిసారి వెళ్ళడం.. ఈ నాలుగు పర్యటనలను కలిపి చూస్తేనే భారత్ "యాక్ట్ ఈస్ట్" విధానం (తూర్పు దిశగా చర్య విధానం) వెనుకవున్న వ్యూహాత్మక లోతు అర్థమవుతుంది. ఈ విధానం ప్రారంభమై పన్నెండేళ్ళు పూర్తయ్యింది. ఈ కాలంలో అది ప్రాంతీయ మార్పులకు అనుగుణంగా తనను తాను మలచుకుంటూ వచ్చింది. కోవిడ్–19 తర్వాత ప్రపంచ సరఫరా వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యాయి. ఉక్రెయిన్, ఇరాన్ సంక్షోభాలు ఆ గందరగోళాన్ని మరింత తీవ్రతరం చేశాయి. అమెరికా ట్రంప్ 2.0 పాలనలో మిత్రదేశాలపట్ల కఠిన వాణిజ్య వైఖరిని అనుసరించడం, చైనాతో "జీ–2" ఏర్పాటుకు ప్రయత్నించడం –ఇవి భారత్, జపాన్, ఆస్ట్రేలియా, ఆసియాన్ దేశాలను తమ భవిష్యత్ వ్యూహాలపై పునరాలోచనకు పురిగొల్పాయి.

ఈ సమావేశం కేంద్రంగా ఆర్థిక భద్రత నిలవడం గమనార్హం. ఈ ఏడాది శిఖరాగ్ర సమావేశంలో ఆర్థిక భద్రత సహకారంపై ఉమ్మడి ప్రకటన అమలుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు; ఇది జాతీయ స్థితిస్థాపకతకు కీలకమైన రంగాలలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు రూపొందించిన చట్రం. సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలు, స్థితిస్థాపక సరఫరా గొలుసులు, ఆర్థిక భద్రత రంగాల్లోకి సహకారాన్ని విస్తరించాలని ఇరువురు నేతలు భావిస్తున్నారు. భద్రతా సహకారంపై కూడా ఉమ్మడి ప్రకటనను ఆమోదించనున్నారు; ఇది ఇండో–పసిఫిక్ భద్రత, రక్షణ సహకారంపై పెరుగుతున్న ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుంది. రాబోయే ఐదేళ్ళలో 5 లక్షల మందికి పైగా నైపుణ్యం కలిగిన, పాక్షిక–నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికుల రాకపోకలను సులభతరం చేసే మానవ వనరుల మార్పిడి కార్యాచరణ ప్రణాళికపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది టోక్యోలో జరిగిన 15వ శిఖరాగ్ర సమావేశంలో రాబోయే దశాబ్దానికి వ్యూహాత్మక దృక్పథాన్ని ఖరారు చేస్తూ, ఆర్థిక భాగస్వామ్యం, ఆర్థిక భద్రత, రాకపోకలు, పర్యావరణ స్థిరత్వం, ఆవిష్కరణలు, ఆరోగ్యం, ప్రజల మధ్య సహకారం వంటి ఎనిమిది కీలక రంగాలను గుర్తించారు. రాబోయే దశాబ్దంలో భారత్‌లో 68 బిలియన్ డాలర్ల జపాన్ పెట్టుబడులను సాధించాలని కూడా నిర్ణయించారు. 2022–2027 మధ్య పెట్టుబడులను రెట్టింపు చేసి 5 ట్రిలియన్ యెన్‌లకు చేర్చాలని జపాన్ తొలుత నిర్ణయించగా, 2025 నుండి ఆ లక్ష్యాన్ని 2035 నాటికి 10 ట్రిలియన్ యెన్‌లకు పెంచింది. సెమీకండక్టర్ తయారీ, కృత్రిమ మేధ, వాహన రంగంలో సహకారం, రక్షణ సంబంధాలు పటిష్టం చేసుకోవడం, సరఫరా గొలుసు స్థితిస్థాపకత పెంచుకోవడంపై చర్చలు కేంద్రీకృతం కానున్నాయి. భారత్–జపాన్ ద్వైపాక్షిక సంబంధం క్వాడ్ కూటమికి, ఇతర ప్రాంతీయ కార్యక్రమాలకు బలాన్నివ్వగలదు. ముఖ్యంగా అమెరికా ఉత్సాహం తగ్గుతున్న తరుణంలో ఇది మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. భారత్–జపాన్–ఆస్ట్రేలియా సరఫరా గొలుసు స్థితిస్థాపకత కార్యక్రమాన్ని తిరిగి పునరుజ్జీవింపజేయగలిగితే, ఇది మూడు దేశాల మధ్య మరింత స్పష్టమైన ఏకాభిప్రాయానికి సంకేతంగా నిలుస్తుంది. తమ కీలక సరఫరా గొలుసులు చైనా ద్వారా ప్రధానంగా సాగకూడదన్న ఉమ్మడి అవగాహన ఇందులో ప్రతిఫలిస్తుంది.

జపాన్ సమావేశం మాత్రమే కాదు, మోదీ చేపట్టనున్న జకార్తా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మూడు దేశాల పర్యటన కూడా ఇండో–పసిఫిక్‌లో భారత్ విస్తృత నిశ్చితార్థాన్ని ప్రతిబింబిస్తుంది. జకార్తాలో మోదీ–ప్రబోవో చర్చలు 2025లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రబోవో భారత్ పర్యటనకు కొనసాగింపుగా జరుగుతాయి. సముద్ర భద్రత, రక్షణ సహకారం, వాణిజ్య విస్తరణ, సరఫరా గొలుసు అభివృద్ధి ఈ చర్చల్లో ప్రధానాంశాలుగా ఉంటాయి. ఇండోనేషియా బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థల కొనుగోలు ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది. ఇది చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం 25 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం, మెరుగైన మార్కెట్ ప్రవేశంతో 50 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలదు. మలక్కా, లోంబోక్, సుండా జలసంధులకు సమీపంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపసమూహమైన ఇండోనేషియా, గ్రేట్ నికోబార్ ప్రాజెక్టులో భారత్ పెరుగుతున్న ఆసక్తికి కీలక వ్యూహాత్మక భాగస్వామిగా మారనుంది. న్యూజిలాండ్‌కు మోదీ పర్యటన 40 ఏళ్ళ తర్వాత భారత ప్రధాని చేస్తున్న తొలి పర్యటన; ఇది భారత్–న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన వెంటనే జరగడం విశేషం. ఆస్ట్రేలియాతో సంబంధం ఇప్పటికే పరిణతి చెందిన భాగస్వామ్యంగా కొనసాగుతోంది. మోదీ, అల్బనీస్ పలు అంతర్జాతీయ సదస్సుల్లో తరచూ సమావేశమవుతూ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తున్నారు. ఇండో–పసిఫిక్ ఆర్థిక చట్రం సరఫరా గొలుసు మండలికి ఉపాధ్యక్ష దేశంగా భారత్ ఎన్నికవడం, సీపీటీపీపీ (కాంప్రహెన్సివ్ అండ్ ప్రోగ్రెసివ్ అగ్రిమెంట్ ఫర్ ట్రాన్స్–పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్)లో చేరికకు దరఖాస్తు చేసుకోవడం.. ఇవి భారత్ తనను తాను కేవలం మార్కెట్ ప్రవేశం కోసం చూసే దేశంగా కాకుండా, విశ్వసనీయమైన భాగస్వామిగా నిలబెట్టుకోవాలన్న వ్యూహానికి సంకేతాలు. భారత్, ఆస్ట్రేలియా, జపాన్, ఇండోనేషియా కలిసి ప్రత్యామ్నాయ సరఫరా గొలుసులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఇప్పుడు మరింత స్పష్టమైంది. ఎందుకంటే ఈ నాలుగు దేశాలు సాంకేతికత, పెట్టుబడి, సరఫరా వనరులు, దిగువస్థాయి అవకాశాలను సమకూర్చగలవు. చైనా దృఢంగా వ్యవహరిస్తున్న తరుణంలో, అమెరికా అనూహ్యంగా మారుతున్న తరుణంలో, ఈ నాలుగు పర్యటనలు భారత్‌ను స్థిరత్వం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి కలిగిన భాగస్వామిగా నిలబెడతాయి. 2026లో యాక్ట్ ఈస్ట్ విధానం కేవలం తూర్పు దిశగా చూడటం మాత్రమే కాదు, దెబ్బతిన్న ప్రపంచ క్రమాన్ని పునరుద్ధరించడంలో భారత్ అభివృద్ధి ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్ళే మార్గంగా మారింది. అమెరికాను భాగస్వామిగా చేయకుండానే, రాబోయే వారాల్లో భారత్ ఈ విధానాన్ని ఎలా అమలు చేస్తుందనేది ఇండో–పసిఫిక్‌లో భవిష్యత్ సహకారాలను నిర్ణయించనుంది. ■




జీవితంలో గెలవడానికి.. ఒక అద్భుతమైన రహస్యం ఉంది. ఎల్లప్పుడూ మీ ముందు మంచి రోజులున్నాయని బలంగా నమ్మండి. మీరేం వెనకబడి లేరు. మీకు సమయం మించి పోలేదు. మీ గతం మిమ్మల్ని అనర్హులుగా మార్చలేదు. జీవితంలో వచ్చే ఒకే ఒక్క కొత్త అవకాశం మీ కథ మొత్తాన్ని మార్చేయగలదు. ఎందుకంటే, జీవితంలో మంచి రోజులు ఎప్పుడూ అత్యంత కఠినమైన పరిస్థితుల తర్వాతే వస్తాయి. ఆ నమ్మకాన్ని వదలకుండా ముందడుగు వేయడమే మీ బాధ్యత. మిగతా దారిని కాలమే చూపిస్తుంది. ఈ రోజు మీరు వేసే ఒక్క చిన్న అడుగు, రేపటి మీ గెలుపుకు పునాది కావచ్చు!

-మహాదేవ

వింతల్లో వింతలు

# ముఖాల అమ్మకం!



చైనాలో ఏఐ (కృత్రిమ మేధ)తో తయారయ్యే మైక్రో–డ్రామాలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో విడుదలైన 1,28,000 మైక్రో–డ్రామాల్లో 95 శాతం ఏఐ సృష్టించినవేనని సీసీటీవీ చానల్ వెల్లడించింది. తక్కువ ఖర్చుతోనే వీటిని తయారు చేయగలగడంతో, వేలాది అపజయాలను ఒక్క హిట్ షో అధిగమించేస్తోంది. అయితే అసలు సమస్య అక్కడే మొదలైంది. నటీనటుల ముఖాలను అనుమతి లేకుండానే ఏఐ కాపీ కొట్టేస్తోంది. దీంతో నిజమైన మనుషుల ముఖాలను చట్టబద్ధంగా వాడుకునేందుకు కంపెనీలు హక్కులు కొనుగోలు చేస్తున్నాయి. లిన్ మిన్ అనే నటికి ఏడాదిపాటు తన ముఖాన్ని వాడుకునేందుకు 500 యువాన్లు (సుమారు రూ.6,000) ఆఫర్ వచ్చింది. ఆమె తిరస్కరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ ట్రెండ్ వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు, సాధారణ గృహిణులు, ఎక్స్‌ట్రాలు ఎక్కువగా తమ ముఖాలను అమ్ముకుంటున్నారు. పెద్ద తారలు మాత్రం ఇలాంటి ఒప్పందాలకు ససేమిరా అంటున్నారు.

